క్లుప్తంగా

అక్రమ రవాణాపై విచారణ

తరిగొప్పుల : మండల కేంద్రంలోని ఆగ్రోస్ సేవా కేంద్రం ద్వారా సబ్సిడీపై రైతులకు అందించాల్సిన జీలుగ విత్తనాలు అక్రమంగా తరలింపుపై వ్యవసాయ అధికారులు విచారణ చేపట్టారు. గురువారం స్థానిక ఎస్సీ కార్పొరేషన్ ఈడీ విక్రమ్ ఆధ్వర్యంలో జీలుగ విత్తనాల నిల్వలపై విచారణ చేపట్టారు. పలువురు రైతులను అడిగి వివరాలను తెలుసుకున్నారు. ఏఓలు చంద్రన్, శ్రీనివాస్‌రెడ్డి, ఏఈఓ వసంత, ఆర్ఐ ఆంధ్రయ్య పలువురు పాల్గొన్నారు.

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా యాదగిరి



రఘునాథపల్లి: మండల కేంద్రానికి చెందిన సీపీఐ మండల కార్యదర్శి కావటి యాదగిరి జిల్లా కార్యవర్గ సభ్యుడిగా రెండోసారి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా గురువారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన జిల్లా సీపీఐ నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

జువెల్లర్స్‌లో షార్ట్ సర్క్యూట్

జనగామ : పట్టణంలోని ఐసీఐసీఐ బ్యాంకు సమీపంలోని శ్రీనప్ప జువెల్లర్స్‌లో షార్ట్ సర్క్యూట్‌తో గురువారం పెనుప్రమాదం తప్పింది. మధ్యాహ్న సమయంలో యజమాని షాపు దుకాణం మూసివేసి ఇంటికి వెళ్లిన సమయంలో షట్టర్‌లోపల నుంచి పొగలు రావడాన్ని సమీప వాసులు గమనించారు. వెంటనే యజమానితో పాటు పోలీసులు, అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. షాపు షెట్టర్ పగులగొట్టి లోనికి వెళ్లి, మంటలు వ్యాప్తి చెందకుండా నియంత్రించారు.

విద్యార్థులను ప్రోత్సహించాలి



బహుమతులు అందజేస్తున్న శేఖర్

జనగామ : విద్యార్థులను ప్రోత్సహిస్తే వారు ఎంతటి పనినైనా అతి సులువుగా, సునాయాసంగా చేస్తారని వివేకానంద సేవా సమితి ట్రస్ట్ కార్యదర్శి దొంతుల శేఖర్ అన్నారు. గురువారం స్థానిక గౌతమి మోడల్ స్కూల్‌లో అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్యార్థులకు రెండు నెలల ప్లాస్టిక్ కవర్స్ సేకరణ అనే అంశంపై ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను అందించామన్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సురేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ పాషా, యాదగిరిరెడ్డి, శ్వేత, శ్రీవాణి, మంజుల, స్వప్న, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ ఎంపికలు

జనగామ రూరల్ : పట్టణంలోని ధర్మకంచ మినీస్టేడియంలో జరుగుతున్న బ్యాడ్మింటన్ సెలక్షన్స్ గురువారం ముగిశాయి. ఎంపికైన క్రీడాకారులను బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గోపగోని సుగుణాకర్, ప్రధాన కార్యదర్శి కైరిక హనుమంతరావు అభినందించారు. రాష్ట్ర స్థాయిలో పాల్గొని మంచి ప్రతిభ కనబరచాలని అన్నారు. 13 ఏళ్ల విభాగంలో సీహెచ్. కౌశిక్, ఎం.అనిరుద్, పి.మనోతేజ, 15 ఏళ్ల విభాగంలో ఎస్.శ్రేష్ట, సిహెచ్ శాన్వి, సీహెచ్ మోక్షు, పి.ధీరజ్ కుమార్, ఏ.స్నేహిత్, 17 ఏళ్ల విభాగంలో ఎస్ శ్రేష్ట, ఇ.సాయి తేజ, ఆశ్రిత్, 19 ఏళ్ల విభాగంలో సాయి తేజ, లెగిసెట్టి ఆర్నవ్ రాజ్, వై.అంకిత్, సిహెచ్ లిఖిత, సీనియర్స్ విభాగంలో అభినవ సాయిరాం, సీహెచ్.లిఖిత, 35 ఏళ్ల విభాగంలో బెనోని, డాక్టర్ ఏరుగు కమల్ ఎంపికయ్యారు. 45 ఏళ్ల విభాగంలో జి సుగుణాకర్, ఏ.అశోక్‌కుమార్, 50 ఏళ్ల విభాగంలో జే సునీల్, ఎం రామచంద్రం, తదితరులు పాల్గొంటారు.

ముస్లింలకు కాంగ్రెస్‌లో సముచిత స్థానం ఇవ్వాలి

జనగామ రూరల్ : ముస్లింలకు కాంగ్రెస్ పార్టీలో సముచిత స్థానం ఇవ్వాలని న్యాయవాది ముహమ్మద్ జమాల్ షరీఫ్ అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో ఆల్ ఇండియా కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌లను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ముహమ్మద్ నయీముద్దీన్, అబ్దుల్ మనన్ రజి, షేర్ అజ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

పాలకుర్తి టౌన్ : మండలంలోని చెన్నూరులో శ్రీసీతారామచంద్రస్వామి విగ్రహ ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవం శుక్రవారం నుంచి ఈనెల 10 వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. 6న దీపారాధన, గణపతి పూజ, పంచగవ్య ప్రసాదము, అగ్నిప్రతిష్ఠ స్వామివారికి జలాభివాసము, 10న మంగళవారం ఇంటి పండుగగా నిర్వహించనున్నట్లు వైదిక నిర్వహకులు పాలకుర్తి గౌతమ్ శాస్త్రి తెలిపారు. రూ. 50 లక్షల విరాళంతో గ్రామానికి చెందిన ఇమ్మడి సోమర్సయ్య నూతన గుడి నిర్మించినట్లు గ్రామస్తులు తెలిపారు.

మహిళలకు కుట్టుపనిలో శిక్షణ

- ఐకేపీ, గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి
- మండలంలోని పాఠశాలలకు 2052 యూనిఫామ్‌లు అందజేత



శిక్షణ కేంద్రంలో యూనిఫామ్స్ కుడుతున్న మహిళలు

చిల్పూరు : మొన్నటి వరకు ఒకరు ఆర్థిక పరిస్థితుల మధ్యలో, మరొకరు కుటుంబ పోషణ కోసం ఇబ్బంది పడేవారు. ఇలా చాలా మంది మహిళలు మహిళా సంఘాల్లో గుర్తింపు ఉన్నప్పటికీ స్థిరంగా ఒక పని అంటూ లేకుండా ఉండేది. గ్రామంలో మహిళా పొదుపు సంఘంలో లీడర్లుగా ఉన్న ఎలిశాల రజిత, జంగం సరళాదేవిలు 2018లో వరలక్ష్మి టెక్స్‌టైల్స్ గ్రామంలోనే కుట్టుశిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేసి ఉత్సాహవంతులైన మహిళలు, యువతకు కుట్టుపనిలో శిక్షణ ఇచ్చేవారు. ఆ సమయంలో రెడీమెడ్ దుస్తులు కుట్టేందుకు ప్రైవేట్ వారు వీరికి ఇచ్చేవారు. దీంతో కుట్టుశిక్షణ పొందేవారు శిక్షణతో పాటు కొంత ఉపాధి లభించేది. దీన్ని గుర్తించిన ఐకేపీ, గ్రామీణాభివృద్ధి సంస్థ వారు ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థుల యూనిఫామ్స్ కుట్టే పనిని అప్పగించారు. మొదట ఈ కేంద్రంలో 25 మంది కుట్టుశిక్షణ పొందేవారు. ప్రస్తుతం 18 మంది కేంద్రంలోనే కుడుతుండగా మరో 65 మందికి వారి వారి ఇళ్లలోనే నిత్యం పని కల్పిస్తున్నారు. ఈ విద్యాసంవత్సరానికి గాను మండలంలోని పాఠశాలలకు 2052 యూనిఫామ్‌లు అందించినట్లు నిర్వాహకులు తెలిపారు.

నాణ్యతతో పనులు చేయిస్తున్నాం



కుట్టు పనులకు 25 మంది శిక్షణ పొందుతుండగా 18 మంది కుట్టుపనులు చేస్తున్నారు. పనుల్లో నాణ్యత ఉండేలా చూస్తున్నాం. పాఠశాలలు తెరువకముందే అందజేశాం. - రజిత (నిర్వాహకురాలు)

శిక్షణ, ఉపాధి కల్పిస్తున్నాం



మహిళలు, యువతులకు కుట్టులో శిక్షణతో పాటు ఉపాధి కల్పిస్తున్నాం. వివిధ మండలాల నుంచి కాజా, బటన్‌లు కుట్టేందుకు 3600 జతల యూనిఫామ్స్ వచ్చాయి. - సరళాదేవి (శిక్షకురాలు)

ఉపాధి పొందుతున్నా



గృహిణిగా ఉన్న తాను కుటుంబ ఆర్థిక పరిస్థితులతో ఇక్కడ కుట్టు శిక్షణ పొందడంతో పాటు ప్రస్తుతం ఉపాధి కూడా పొందుతున్నా. - ఎండీ షర్మాన(గ్రామస్తురాలు)

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు అందించాలి

- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య



ధర్నాలో నినాదాలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య, బీఆర్‌ఎస్ నాయకులు

స్టేషన్‌ఘన్‌పూర్ : కాంగ్రెస్ ప్రభుత్వంలో అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను అర్హులైన పేదలకు అందించాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య డిమాండ్ చేశారు. మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల విషయంలో నిరుపేదలకు అన్యాయం జరిగిందని తెలుసుకున్న ఆయన గురువారం పార్టీ నాయకులతో కలిసి గ్రామంలో పర్యటించారు. అర్హత ఉండి ఇళ్లు రాని నిరుపేదలను కలిసి వారితో మాట్లాడారు. అనంతరం బాధితులతో కలిసి గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి, ఎమ్మెల్యే కడియం శ్రీహరికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం రాజయ్య మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లు వస్తాయని ఉన్న పాత పెంకుటిళ్లు కూల్చి వేసి ముగ్గు పోసుకున్న బాధితులకు తీరా చూస్తే జాబితాలో పేర్లు మాయం అయ్యాయన్నారు. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో తీవ్ర అవినీతి జరుగుతుందని, గ్రామసభలో చేపట్టాల్సిన లబ్ధిదారుల ఎంపిక ఎమ్మెల్యే శ్రీహరి నివాసంలో, అతని అనుచరుల సమక్షంలో జరుగుతుందని మండిపడ్డారు. ఈ విషయమై సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించాలని, సమగ్ర విచారణ చేపట్టి అనర్హులను తొలగించి అర్హులను న్యాయం చేయాలని రాజయ్య డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు గంగుల శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ నాయకులు తాటికొండ సురేష్‌కుమార్, గణేష్, దశరథ్, ఎం.మహేందర్, ప్రసాద్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

సోమేశ్వరస్వామికి అనాథ పిల్లల పూజలు

పాలకుర్తి టౌన్: స్థానిక సోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో గురువారం జఫర్‌గడ్‌కు చెందిన మా ఇల్లు ఆశ్రమ అనాథ పిల్లలు స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు వారికి స్వామివారి ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ సల్వాది మోహన్‌బాబు, సూపరింటెండెంట్ కొత్తపల్లి వెంకటయ్య, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలోని రాజీవ్ చౌరాస్తా ప్రమాదాలకు నిలయంగా మారింది. చౌరస్తాలో నాలుగు వైపులా ఇష్టానుసారం ఫ్లెక్సీలు పెట్టడంతో గురువారం కారు, బైక్ ఢీకొన్నాయి. బైక్ నడుపుతున్న బమ్మెర గ్రామానికి చెందిన శ్రీకాంత్‌కు కాలు విరగడంతో ఆస్పత్రికి తరలించారు. రాజీవ్ గాంధీ విగ్రహం చుట్టూ నాలుగు వైపులు అన్ని రాజకీయ పార్టీలు, ఇతర ఫ్లెక్సీలు పెట్టకుండా చూడాని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వం సంపూర్ణ రుణమాఫీ చేయాలి

- రైతు సంఘం ఆధ్వర్యంలో బ్యాంకుల ఎదుట ధర్నా



పాలకుర్తి టౌన్ : తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఎదుట ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

పాలకుర్తి టౌన్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన రూ. 2 లక్షల పై బడిన ఉన్న రైతులకు రుణమాఫీ చేసి కొత్త రుణాలు ఇవ్వాలని రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం స్థానిక పంజాబ్ నేషనల్ బ్యాంక్, తెలంగాణ గ్రామీణ బ్యాంకుల ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా బ్యాంక్ మేనేజర్లకు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మాచర్ల సారయ్య మాట్లాడుతూ మండలంలోని ఎల్లరాయిని తొర్రూరు, పాలకుర్తి సహకార సంఘాలు, పంజాబ్‌నేషనల్ బ్యాంక్, తెలంగాణ గ్రామీణ బ్యాంకుల ద్వారా 47కోట్ల 60 లక్షలు రుణ మాఫీ కాగా ఇంకా 69కోట్ల 23 లక్షల రుణమాఫీ కావాల్సి ఉందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు సోమ సత్యం, ముస్కు ఇంద్రారెడ్డి, బెల్లి సంపత్, మదార్, కొమురయ్య, రాంరెడ్డి,బచ్చు శ్రీలత, పాల్గొన్నారు.

జఫర్‌గఢ్ : వానాకాలం సీజన్ ప్రారంభమైన తరుణంలో పంట రుణాలు సత్వరమే మంజూరు చేయాలని తెలంగాణ రైతు సంఘం మండల కార్యదర్శి నక్క యాకయ్య డిమాండ్ చేశారు. గురువారం స్థానిక తెలంగాణ గ్రామీణ బ్యాంక్ ఎదుట పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహించి పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని బ్యాంకు మేనేజర్‌కు అందజేశారు. కార్యక్రమంలో చిరంజీవి, పెద్ద రాములు, నాగయ్య చిన్నరాములు, సుధాకర్, సుధాకర్, నర్సింగం, శ్రీను, సాంబరాజు పాల్గొన్నారు.

శివునిపల్లిలో రికార్డుల దహనం



దహనం అవుతున్న రికార్డులు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని శివునిపల్లి శివారు పాలకుర్తి రోడ్డులో ఉన్న ఓ వెంచర్ సమీపంలోని ఖాళీస్థలంలో పలు పత్రాలు, రికార్డులు దహనం చేసిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. కాగా సదరు రికార్డులు శివునిపల్లి గ్రామ పంచాయతీకి చెందినవి అయి ఉంటాయని పలువురు అనుమానించగా పత్రాల దహనం విషయం గ్రామంలో కలకలం రేపింది. గతంలో శివునిపల్లికి చెందిన పంచాయతీ కార్యదర్శి ఒకరు ఏసీబీకి పట్టుపడటం, ఇటీవల మరో కార్యదర్శి సస్పెండ్‌కు గురికావడంతో సదరు పత్రాల దహనం వార్త గ్రామంలో దావానంలా వ్యాపించింది. దాంతో పలువురు గ్రామానికి చెందిన వ్యక్తులు పత్రాలు దహనం చేసిన చోటుకు వెళ్లి చూడగా దహనం చేసిన రికార్డులు, పత్రాలు స్థానిక బ్యాంకు ఆఫ్ బరోడాకు చెందినవిగా గుర్తించారు. దాంతో బ్యాంకు అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరికీ సమాచారం లేకుండా నిర్జన ప్రదేశంలో పత్రాలను దహనం చేయడంలో ఆంతర్యమేమిటని పలువురు చర్చిస్తున్నారు. కాగా గతంలో జరిగిన కుంభకోణం విషయమై ఏమైనా వాస్తవాలు బయటపడతాయనే భయంతో దహనం చేయించారా అనే చర్చ జరుగుతుంది.

అనవసరపు రికార్డులను దహనం చేయించాం : మేనేజర్, శరత్

ఈ విషయమై బీఓబీ మేనేజర్ శరత్‌ను వివరణ కోరగా 2014కు ముందు ఉన్న పాత రికార్డులను దహనం చేయించినట్లు తెలిపారు. పొగ కాలుష్యం అవుతుందని నిర్జనప్రదేశంలో చేయించినట్లు పేర్కొన్నారు.

సంక్షిప్త సమాచారం

వర్షాలతోనే సేద్యం

బచ్చన్నపేట : అన్నదాతలు సేద్యం చేయాలంటే వర్షాలపైనే ఆధారపడి చేస్తుంటారని బీజేపీ మండల అధ్యక్షుడు బంగారు మహేశ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలనే లబ్ధిదారులకు అందిస్తున్నారని అన్నారు. ప్రతి ఇంటా మొక్కలు నాటాలని దీంతో అందరూ ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. ఈజీఎస్ పథకంలో పండ్ల తోటలను నాటుకోవచ్చని తెలిపారు. తోటలతో తక్కువ ఖర్చుతో ఎక్కువ రాబడిని రైతులు పొందవచ్చని సూచించారు.

ఆర్థికసాయం

తరిగొప్పుల : మండల కేంద్రానికి చెందిన అర్జుల మోహన్‌రెడ్డి కూతురు వివాహానికి నాగార్జున డెయిరీ తరపున ఏజీఎం వెంకటస్వామి ఆర్థికసాయాన్ని అందించారు. బుధవారం నూతన వధూవరులను దీవించి రూ. 10 వేలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాల డెయిరీలో పాలు పోస్తున్న రైతుల కూతుళ్ల వివాహాలకు ఆర్థిక సహాయం అందిస్తామని, అందులో భాగంగానే పాడి రైతు మోహన్‌రెడ్డి కూతురుకు అందించామన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ చెంద్రమౌళి, తాళ్లపల్లి పోచయ్య, శ్రావణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత

- అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్



స్టేషన్‌ఘన్‌పూర్ : మున్సిపల్ కార్యాలయంలో రిజిస్టర్లను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్



లింగాలఘణపురం : చీటూరు నుంచి సైకిల్ యాత్ర నిర్వహిస్తున్న యువకులు

స్టేషన్‌ఘన్‌పూర్: పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయ ఆవరణలో కమిషనర్ రవీందర్‌తో కలిసి ఆయన మొక్కను నాటారు. ముందుగా మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించిన ఆయన కమిషనర్ కార్యాలయంలోని రికార్డులు, రిజిష్టర్లను పరిశీలించారు. ప్రతీ ఒక్కరూ విధులకు సకాలంలో హాజరుకావాలని, నిర్ణీత సమయంలో పన్నుల వసూళ్లను చేపట్టాలన్నారు. ప్రజల నుంచి ఏమైనా ఫిర్యాదులు వస్తే రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన

పాలకుర్తి టౌన్ : వివాహ వేడుకల్లో పర్యావరణ దినోత్సవం సందర్భంగా నూతన దంపతులు పర్యావరణపై వినూత్నరీతిలో అవగాహన కల్పించారు. గురువారం మండల కేంద్రానికి చెందిన కొంగరి సునీల్, సంజన వివాహ వేడుకలు శివాం గార్డెన్‌లో సునీల్, సంజన నవదంపతులు క్లాత్ బ్యానర్‌ని ప్రదర్శిస్తూ భవిష్యత్‌లో జరిగే ప్రతి వేడుకలను ప్రకృతి పర్యావరణ హితంగా జరిగేలా చేసుకుంటామని ప్రతిజ్ఞ చేశారు.

పచ్చదనంతోనే పర్యావరణ పరిరక్షణ

నర్మెట : పచ్చదనంతోనే పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్‌ను నిషేధిస్తేనే మనుగడ సాధ్యమని తహసీల్దార్ కలకుంట్ల వెంకట రామానుజాచార్యులు, ఎంపీడీఓ బోడపాటి అరవింద్ చౌదరి అన్నారు. గురువారం సిబ్బందితో కలిసి మొక్కలు నాటిన అనంతరం వారు మాట్లాడారు.

ప్రతీ ఒక్కరు మొక్కలను పెంచాలి

బచ్చన్నపేట : పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదపడతాయని అన్ని గ్రామాల్లో ప్రతీ ఒక్కరు మొక్కలను పెంచాలని ఎంపీడీఓ వెంకటమల్లికార్జున్ అన్నారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో మొక్కలను నాటించారు.

వృక్షాల పరిరక్షణకు సైకిల్ యాత్ర

లింగాలఘణపురం : ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం మండల కేంద్రానికి చెందిన చెన్నూరి మల్లేశం, ఆకుల రవి రోడ్లకు ఇరువైపుల ఉన్న చెట్లను రక్షించాలని కోరుతూ చీటూరు నుంచి కలెక్టరేట్ వరకు సైకిల్ యాత్ర నిర్వహించారు. జిల్లాలోని జాతీయ రహదారులు, పంచాయతీ రోడ్లకు ఇరువైపుల ఉన్న చెట్లకు ఆయా కంపెనీల ప్రచారం కోసం మేకులతో బోర్డులు, బ్యానర్లు ఏర్పాటు చేస్తున్నారని, దీంతో కాండం దెబ్బతినడంతో చెట్లు చనిపోయే ప్రమాదం ఉంటుందన్నారు. చీటూరు, కిష్టగూడెం, కుందారం, పటేల్‌గూడెం, నెల్లుట్ల మీదుగా సైకిల్ యాత్ర నిర్వహించి కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు.

వ్యవసాయ అధికారులకు షోకాజ్ నోటీసులు



రికార్డులను పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

బచ్చన్నపేట : మండల కేంద్రంలో ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం ద్వారా జరిగిన విత్తనాల పంపిణీ అవకతవకలపై స్థానిక, తరిగొప్పుల ఏఓలు విద్యాకర్ రెడ్డి, మనోహిత్ విక్రమరావులకు షోకాజ్ నోటీసులు అందించారు. మహబూబాబాద్ టాస్క్‌ఫోర్స్ అధికారులు వచ్చి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సై ఎస్‌కే అబ్దుల్ హమీద్ సమక్షంలో నోటీసులను అందించారు. అలాగే గురువారం పాలకుర్తి ఏడీఏ పర్శరాంనాయక్ బృందం ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామాల్లో తనిఖీలను నిర్వహించారు. జీలుగ విత్తనాల రికార్డుల ఆధారంగా ఆ యా గ్రామాలకు వెళ్లి రైతులను అడిగి తెలుసుకొని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కొన్నె, లింగంపల్లి, నాగిరెడ్డిపల్లి, పడమటికేశ్వాపూర్ గ్రామాల్లో జీలుగ విత్తనాలు తీసుకున్న రైతులను విచారిస్తూ రికార్డులను పరిశీలించారు. రికార్డులో నమోదైన విక్రయ వివరాల ప్రకారం విచారణ చేయగా విత్తన బస్తాలు తేడా వస్తున్నట్లు అధికారులు తెలిపారు. మరో విచారణ బృందంలో ఏఓలు, ఏఈఓలు ఉన్నారు.

స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటాలి

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి, పక్కన ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్

స్టేషన్‌ఘన్‌పూర్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ సత్తాను చాటేలా ప్రతీ కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. డివిజన్ కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో కాంగ్రెస్ మండల విస్తృతస్థాయి సమావేశాన్ని గురువారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియంతో పాటు ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, స్థానిక సంస్థల పార్టీ జిల్లా పరిశీలకులు లింగం యాదవ్ హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో కాంగ్రెస్‌పార్టీ బలంగా ఉందని, పార్లమెంట్ ఎన్నికల ఫలితాలే ఇందుకు నిదర్శనమన్నారు. రానున్న మూడేళ్లలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు వస్తాయన్నారు. ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ మాట్లాడుతూ గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో వేల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడ్డారని, బీఆర్‌ఎస్, బీజేపీ దొందూ దొందే అని విమర్శించారు. అవినీతికి కేరాఫ్ అయిన బీఆర్‌ఎస్ నేతలు పేదల పక్షపాతి అయిన కాంగ్రెస్‌ను విమర్శించడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బొడ్రాయి ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే పూజలు

చిల్పూరు : మండలంలోని నష్కల్ గ్రామంలో గురువారం బొడ్రాయి ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి పాల్గొన్నారు. అర్చకుల వేద మంత్రాల మధ్య ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో వంగాల జగన్‌మోహన్‌రెడ్డి, కర్ణకంటి స్వప్నవెంకటేష్, పాశం సురేష్, సాంబయ్య ఉన్నారు.

పార్టీకి పునాది కార్యకర్తలే

పార్టీకి పునాది కార్యకర్తలే అని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. అనంతరం సంస్థాగత ఎన్నికలపై కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గడ్డమీది సురేష్, చిల్పూరు ఆలయ చైర్మన్ శ్రీధర్ రావు, బాలరా జు, లక్ష్మారెడ్డి, నాగరాజు, మల్లారెడ్డి, రమేష్, ఉమ్లానాయక్, సునీల్, యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.

సన్నబియ్యం పంపిణీ లక్ష్యాలను సాధించాలి

- అదనపు కలెక్టర్ రోహిత్‌సింగ్



పట్టణంలో పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్

జనగామ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు సన్న బియ్యం అందించాలనే సంకల్పాన్ని నెరవేర్చేందుకు అధికారులు అంకితభావంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ రోహిత్ సింగ్ ఆదేశించారు. గురువారం సన్నబియ్యం పంపిణీపై ఆయన పట్టణంలోని 2 నిత్యావసర దుకాణాలను సందర్శించి పంపిణీ విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ మూడు నెలల సన్నబియ్యం జూన్ నెలలోనే సరఫరా చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నందున అధికారులు పంపిణీలో జాప్యం చేయరాదన్నారు. మండల స్టాక్ పాయింట్లను సందర్శించి రిజిస్టర్లను పరిశీలించారు. బియ్యం పంపిణీలో వేగం పెంచాలని సూచించారు.

ప్రమాదాల నివారణకు సహకరించాలి

- ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ వేణుమాధవ్



మాట్లాడుతున్న ఎస్ఈ వేణుమాదవ్

స్టేషన్‌ఘన్‌పూర్ : విద్యుత్ ప్రమాదాల నివారణకు కేబుల్ ఆపరేటర్లు సహకరించాలని ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ వేణుమాధవ్ అన్నారు. డివిజన్ పరిధిలోని కేబుల్ ఆపరేటర్లతో స్థానిక సబ్‌డివిజన్ కార్యాలయంలో గురువారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఎస్ఈ మాట్లాడుతూ విద్యుత్ స్తంభాలపై అస్తవ్యస్తంగా వేలాడుతున్న కేబుల్‌వైర్లను, సెటాప్ బాక్సులను ఒక పద్ధతి ప్రకారం అమర్చుకోవాలన్నారు. విద్యుత్ సరఫరాలో సమస్య వచ్చినప్పుడు వాటిని సరిచేసేందుకు సిబ్బంది స్తంభాలు ఎక్కే సమయంలో ఇబ్బందులకు గురవుతున్నారు. కార్యక్రమంలో ఎస్ఏఓ జయరాజ్, డీఈలు రాంబాబు, గణేష్, ఏడీఈలు రణధీర్‌రెడ్డి, శ్రీనివాస్, ఏఈలు భువనేశ్వరి, లక్ష్మీనారాయణ, శివకుమార్, విశ్వసాహితి, ఎస్ఈలు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

- ఆర్డీఓ గోపిరామ్



జనగామ రూరల్ : గోపిరాజుపల్లిలో రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ గోపిరామ్



పాలకుర్తి : దరఖాస్తులు సమర్పిస్తున్న రైతులు

జనగామ రూరల్ : ప్రభుత్వం అమలు చేస్తున్న భూభారతి చట్టం వల్ల భూ సమస్యలు త్వరగా పరిష్కారమవుతాయని రైతులకు అవగాహన కల్పించడానికి సదస్సు నిర్వహిస్తున్నామని ఆర్డీఓ గోపిరామ్ అన్నారు. గురువారం మండలంలోని గోపిరాజుపల్లి గ్రామం, పట్టణంలోని ప్రెస్టెన్ కళాశాల ఆవరణలో రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూ సమస్యలు పరిష్కరించి రైతులకు వారి భూములపై పూర్తి హక్కులు కల్పించేందుకే ప్రభుత్వం భూభారతి చట్టం అమలు చేస్తోందని అన్నారు.

అసైన్డ్ భూములపై పట్టాలివ్వండి

పాలకుర్తి : మండలంలో నిర్వహిస్తున్న భూ భారతి కార్యక్రమంలో తాము సాగు చేస్తున్న ప్రభుత్వ భూములపై తమకు పట్టాలిప్పించాలని రైతులు కోరుతూ దరకాస్తు చేసుకున్నారని తహసీల్దార్ నాగేశ్వరాచారి అన్నారు. గురువారం మండలంలోని ఈరవెన్ను గ్రామంలో 96, మైలారం గ్రామంలో 26 మంది రైతులు దరఖాస్తులు అందజేశారని తెలిపారు.

బచ్చన్నపేట : భూభారతి చట్టంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలు ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవాలని జనగామ ఆర్డీఓ గోపీరామ్ అన్నారు. గురువారం మండలంలోని కేసిరెడ్డిపల్లి, మన్‌సాన్‌పల్లి గ్రామాలలో నడుస్తున్న రెవెన్యూ సదస్సులను పరిశీలించారు.

రఘునాథపల్లి : భూ సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న భూ భారతి రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ మోహ్సిన్‌ముజ్తబ అన్నారు. గురువారం మండలంలోని నిడిగొండలో తహసీల్దార్, బాంజీపేటలో నాయబ్ తహసీల్దార్ శంకర్‌ల ఆధ్వర్యంలో భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. రైతుల నుంచి భూ సమస్యలపై నిడిగొండలో 114 దరఖాస్తులు, బాంజీపేటలో 93 దరఖాస్తులు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు.